యోగాతో మానసిక ప్రశాంతత

- ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం
- ఆసనాలతో ఆకట్టుకున్న విద్యార్థులు

తుని: యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ చదరం శివాజీ అన్నారు. తుని బ్యాంకు కాలనీలోని సరస్వతీ శిశుమందిర్‌లో గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా గురువు వేములూరి ప్రసాద్ విద్యార్థులకు యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులతో యోగాసనాలను వేయించారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. వాకర్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ, తుని శాఖ అధ్యక్షుడు డీఎస్ మూర్తి, దణ్యంరాజు సత్యసాయి, పర్వత బాబూరావు, ప్రభావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జిల్లా వ్యాప్తంగా యోగా దినోత్సవం

ప్రత్తిపాడు: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్టు జిల్లా బీజేపీ యోగా డే ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ యోగా దినోత్సవాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలో ఏటా యోగా డే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం 400 మంది యోగా శిక్షకులతో యోగా డే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారామాంజనేయ చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



తునిలో విద్యార్థులకు యోగాసనాలు నేర్పిస్తున్న గురువు ప్రసాద్



తునిలో విద్యార్థులకు యోగాసనాలు నేర్పిస్తున్న గురువు ప్రసాద్

ఘనంగా యోగా వేడుకలు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో పలు రకాల ఆసనాలు వేయించారు. నిత్యం ఆసనాలు వేస్తే జ్ఞాపక శక్తి, మానసిక ప్రశాంతత, ఒత్తిడి, శాంతి, సమతుల్యత లభిస్తాయని ప్రిన్సిపాల్ మూర్తి అన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన వెస్లీ



తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను కలిసిన జాన్‌వెస్లీ

జగ్గంపేట: అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు అనుకూలంగా రాకపోయినా ఎటువంటి నిరుత్సాహానికి గురికావద్దని, పార్టీ బలోపేతానికి ధైర్యంగా ముందడుగు వేయాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని ఆ పార్టీ ఉభయ గోదావరి జిల్లాల క్రిస్టియన్ మైనార్టీసెల్ జోన్ ఇన్‌చార్జి జాన్ వెస్లీ తెలిపారు. జగ్గంపేటలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తాడేపల్లిలో జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్టు తెలిపారు. భవిష్యత్‌లో పార్టీ చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి సిద్ధంగా ఉండాలని జగన్ తమకు సూచించినట్టు చెప్పారు.

క్లుప్తంగా

200 మందికి కంటి పరీక్షలు



పేరవరంలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఏలేశ్వరం: మండలంలోని పేరవరంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి కంటి పరీక్షలు చేశారు. తిరుమాలి గ్రామానికి చెందిన మిరాకిల్ మినిస్ట్రీస్ అండ్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జగ్గంపేటకు చెందిన రాజేశ్వరి, రామకృష్ణ లయన్స్ నేత్రాలయ వైద్యుడు నాగరాజు రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. శస్త్ర చికిత్సల కోసం 20 మందిని కాకినాడకు తరలించారు. కార్యక్రమంలో పలివెల ప్రవీణ్, వేమగిరి ప్రేమానందం, మల్లారపు అబ్రహం, తాతపూడి సురేష్, వేమగిరి రాజబ్బాయి, గుడాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



ఎంపీపీ బుజ్జిని సన్మానిస్తున్న సిబ్బంది, మహిళలు

ఏలేశ్వరం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో ఏపీఎం సత్యప్రసాద్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. మహిళలు డ్వాక్రా రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. మహిళలకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం ఎంపీపీతో పాటు సొసైటీ మాజీ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు



ప్రత్తిపాడు హాస్టల్‌లో మలేరియా నివారణా మందు పిచికారీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ప్రత్తిపాడు: మలేరియా నివారణకు వైద్యారోగ్య సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో మలేరియా వ్యాప్తి చెందే అవకాశం ఉండటంతో రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్ఆర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రత్తిపాడులోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం, ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాల ఆవరణలోనూ, గదులలోనూ మలేరియా నివారణ (ఏసీఎం మందు)ను వైద్య సిబ్బంది పిచికారీ చేశారు. వసతిగృహాల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారి పవన్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి ఆనంద్, వసతిగృహాల సంక్షేమాధికారులు ఎంఎస్ సత్యనారాయణ, ఎం.శైలజారాణి, హెల్త్ సూపర్‌వైజర్ టి.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన ద్రవ్యవిధానంపై అవగాహన

ప్రత్తిపాడు: వడ్డీ వ్యాపారులు అవలంబిస్తున్న సరికొత్త ఫైనాన్స్ విధానంపై అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని చినశంకర్లపూడిలో గురువారం సాయంత్రం సరికొత్త ఫైనాన్స్ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది ఫైనాన్స్ మోసగాళ్ల వలలో పడి మోసపోయిన బాధితులను మనం చూస్తున్నామన్నారు. మధ్య తరగతి, సామాన్య కుటుంబీకులు ఫైనాన్స్ వ్యాపారుల వద్దకు వెళితే జీపీ పవర్ లీడ్ చేయించుకుని, అప్పు (రుణం) ఇస్తున్నారన్నారు. కొంత కాలం తర్వాత అప్పు తీర్చేందుకు వెళితే, మీ ఆస్తి మీదు కాదు, ఏనాడో మాకు రిజిస్టర్ అయ్యిందని దౌర్జన్యం చేస్తూ బెదిరిస్తున్నారన్నారు. ప్రజలు వడ్డీ వ్యాపారుల సిండికేట్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సంఘ రక్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హిందూ సామ్రాజ్య దినోత్సవం

ప్రత్తిపాడు: స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వహించారు. తొలుత బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శింగిలిదేవి సత్తిరాజు ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హిందూ సామ్రాజ్య స్థాపనకు శివాజీ చేసిన సేవలను కొనియాడారు. బీజేపీ మండల నాయకులు కూరాకుల రాజా, మదినే బాబ్జి, కంతస్వామి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్: రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మండలంలోని తేటగుంటలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే దివ్య ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా పిలుస్తారన్నారు. ఎమ్మెల్యే అయిన తర్వాత తన మొదట కార్యక్రమం వ్యవసాయం, రైతులకు సంబంధించినది కావడం అదృష్టమన్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో 13 వేల హెక్టార్లలో ఖరీఫ్ సాగవుతుందని ఏఓ బి.అశోక్ కుమార్ తెలిపారు. మెట్ట రైతులకు అవసరమైన వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, చోడిశెట్టి గణేష్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం



జగ్గంపేట సర్వీస్ రోడ్డులో డ్రైనేజీలో ఇరుక్కుపోయిన లారీ

జగ్గంపేట: స్థానిక హైవే బ్రిడ్జి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులో గురువారం కలప లోడుతో వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో డ్రైనేజీలో ఇరుక్కుపోయింది. దీంతో ఈ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. తుని వైపు వెళ్లే వాహనాలను స్థానిక సెంటర్ నుంచి హైవే బ్రిడ్జి మీదగా మళ్లించారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

కోటనందూరు: నీటి సంరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఈఓపీఆర్డీ జి.అరుణ్‌మార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని బొద్దవరం హైస్కూల్లో విద్యార్థులకు గురువారం నీటి సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మానవ మనుగడకు మూలాధారమైన నీటిని పరిరక్షించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. వర్షపునీటిని వృథాగా పోనీయకుండా ఒడిసి పట్టేందుకు ఇంకుడుగుంతలు తవ్వుకోవడం, చెరువుల లోతు పెంచడం, ఎక్కడికక్కడ కల్వర్టులు నిర్మించుకోవడం చేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు నీటి సంరక్షణను బాధ్యతగా తీసుకోకపోతే భవిష్యత్ తరాలు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు నీటిసంరక్షణ ప్రాధాన్యతపై అవగాహన పెంచుకొని అన్ని వర్గాల ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. అనంతరం నీటి సంరక్షణపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ వెంకటరమణ, ఉపాధ్యాయులు నారాయణ, శివరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి భవానీ తదితరులు పాల్గొన్నారు.



బొద్దవరంలో నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రాజబాబు

ప్రత్తిపాడు: బడి ఈడు పిల్లలు నూరుశాతం బడుల్లో ఉండేలా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు సూచించారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో గురువారం 'నేను బడికి పోతా' కార్యక్రమంపై ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేను బడికి పోతా' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జూలై 12 వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. మధ్యలో బడి మానేసిన 9 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించి, వారిని తిరిగి బడిలో చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు గ్రామాల్లో సర్వే నిర్వహించి బడి ఈడు పిల్లలను గుర్తించడం, వారిని తక్షణం బడిలో చేర్పించడం బాధ్యతగా తీసుకోవాలని ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆర్‌వీఎస్ లక్ష్మి, ఎంఈఓ-2 వై.అచ్చిరాజు, సీఆర్పీలు రాంజీప్రసాద్, అప్పన మల్లేషు, గంగారాం, బాషా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపండి

ప్రత్తిపాడు రూరల్: పాఠశాలలకు తమ పిల్లలను పంపడంలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ప్రత్తిపాడు ఎంఈఓ వి.రాజబాబు సూచించారు. మండలంలోని శరభవరం, గజ్జనపూడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నేను బడికి పోతా కార్యక్రమంపై తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాజబాబు మాట్లాడుతూ పిల్లవాడు ఏదో ఒక బడిలో తప్పనిసరిగా చదువుతూ ఉండాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, నోటు పుస్తకాలు అందివ్వడమే కాకుండా మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, సీఆర్పీ రాంజీ ప్రసాద్, హెచ్ఎం వరహాలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు తాగునీరు అందించాలని వినతి

ప్రత్తిపాడు: మండలంలోని గిరిజనాపురం గిరిజన తండావాసులకు తక్షణమే తాగునీరు అందించాలని ఆ గ్రామ గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు ఆధ్వర్యంలో గిరిజనులు గురువారం ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎస్.డేవిడ్‌రాజ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వల్లూరి రాజబాబు మాట్లాడుతూ ఇ.గోకవరం గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజనాపురం తండాలో తాగునీరందక ఆదివాసీలు అల్లాడిపోతున్నారన్నారు. కొండల్లోని నుంచి వచ్చిన జలధారలతో దప్పిక తీర్చుకుంటే రొంప, దగ్గు, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని, గిరిజనాపురం ఆదివాసీలకు రక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు కుంచే అంజిబాబు, జిల్లా నాయకుడు డి.నారాయణమూర్తి, గిరిజనాపురం తండావాసులు మట్టే కుమారి, బాలకృష్ణ, ఉళ్ల బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు ఎంపీడీఓ డేవిడ్ రాజ్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజనాపురం తండా వాసులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తునిలో ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకట్రావు

తుని: ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రావు సూచించారు. గురువారం పట్టణ పరిధిలోని 17వ వార్డులో ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట్రావు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, వ్యర్థాలను పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ప్రజారోగ్యశాఖ అధికారి శేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన

జగ్గంపేట: ఖరీఫ్‌లో వరిసాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని, విత్తన శుద్ధి చేస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారులు అన్నారు. మండలంలోని గొల్లలగుంట పంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు గురువారం విత్తన శుద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. విత్తనంపై సహజంగా తెగుళ్లను కలిగించే బ్యాక్టీరియా ఉంటుందని, విత్తన శుద్ధి చేయకుండా విత్తనం వాడితే పంటకు వ్యాధులు, తెగుళ్ల వ్యాపిస్తాయన్నారు. విత్తన శుద్ధి చేయడం వల్ల మొలకదశలోనే భూమి, నీటి ద్వారా సంక్రమించే వివిధ రకాల వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. విత్తన శుద్ధి చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు డి.రఘు తదితరులు పాల్గొన్నారు.



గొల్లలగుంటలో విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

యర్రవరంలో కార్మికుల ఆందోళన

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో సీపీఎఫ్ కంపెనీ వద్ద గురువారం కార్మికులు ఆందోళన చేశారు. సీపీఎఫ్ కంపెనీలో పని చేస్తున్న కార్మికుల తొలగింపును నిరసిస్తూ సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో కంపెనీ వద్ద కార్మికుల ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా సరిపల్లి గ్రామంలోని సీపీఎఫ్ కంపెనీలో 71 మంది కంపెనీ ఉద్యోగులు, 150 మంది కాంట్రాక్టు ఉద్యోగులను అన్యాయంగా తొలగించారన్నారు. కార్మికుల తొలగింపుపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల తొలగింపును వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐ శేఖర్‌బాబు శిబిరం వద్దకు చేరుకుని చర్చలు జరిపారు. యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఏసుబాబు, రామకృష్ణ, రాంబాబు, నాయుడు, కార్మికులు పాల్గొన్నారు.



యర్రవరంలోని సీపీఎఫ్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

వీఏఏ, వీహెచ్‌ఏలకు అదనపు బాధ్యతలు

గోకవరం: మండలంలో పలు గ్రామాల్లో వీఏఏ, వీహెచ్‌ఏలకు అదనపు బాధ్యతలు అప్పగించినట్టు మండల వ్యవసాయశాఖ అధికారి రాజరాజేశ్వరి గురువారం తెలిపారు. పలు గ్రామాల్లో సిబ్బంది కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వారి సూచనల మేరకు తక్కువ పంట విస్తీర్ణం ఉన్న వీఏఏలు, వీహెచ్‌ఏలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించామన్నారు. పీఎం కిసాన్ పథకంలో గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న రికార్డులపై సమీక్ష నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

డ్రైన్‌లో పూడికతీత పనులు ప్రారంభం

జగ్గంపేట: స్థానిక శెట్టిబలిజ పేటలోని ప్రధాన మురికి కాలవల్లో పూడికతీత పనులను గురువారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్ పర్యవేక్షణలో అధికారులు పూడిక తీత పనులు చేపట్టారు. ఎన్నికలకు ముందు శెట్టిబలిజపేట వాసులకు ఇచ్చిన హామీ మేరకు మురికి కాలవల్లో పూడిక తీసి, వచ్చే వర్షాకాలంలో ముంపు సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్టు నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ రవాణా అడ్డగింపు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో గ్రావెల్ అక్రమ రవాణాను టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. గ్రామంలోని పోలవరం కాలువ గట్టు గ్రావెల్‌ను కొంతమంది తవ్వి అక్రమంగా తరలించుకుపోతున్నారు. కాగా గురువారం మట్టిని అక్రమంగా తరలిస్తుండగా టీడీపీ నేతలు అడ్డుకున్నారు.

ఎస్సై అబ్దుల్ నబీకి పదోన్నతి

రౌతులపూడి: స్థానిక ఎస్సై అబ్దుల్ నబీకి సీఐగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఎస్సై నబీ గురువారం కాకినాడ ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం ఏలూరు రేంజ్ డీఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నట్లు ఎస్సై నబీ తెలిపారు. రౌతులపూడి ఎస్సైగా విధులు నిర్వహించిన అనతి కాలంలోనే నబీ ప్రజల మన్ననలు పొందారు. సీఐగా పదోన్నతి లభించడంతో ఎస్సై నబీకి పలువురు నేతలు అభినందనలు తెలిపారు.



కాకినాడలో ఎస్పీ సతీస్‌కుమార్‌ను కలసిన ఎస్సై అబ్దుల్ నబీ



భానుడి భగభగలు

కిర్లంపూడిలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

కిర్లంపూడి: మెట్టప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నారు. ఉష్ణతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గురువారం ఎండ తీవ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 11 గంటల తర్వాత రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం 5 గంటల వరకూ గుబులు, వేడిగాలులు తగ్గకపోవడంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా వర్షాల కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. నీటి పారుదల సౌకర్యాలు ఉన్నచోట రైతులు ఇప్పటికే ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించారు.

తప్పుడు కేసులు ఎత్తివేయాలంటూ ఆందోళన



తుని గొల్ల అప్పారావు సెంటర్లో నిరసన తెలుపుతున్న లిబరేషన్ నాయకులు

తుని: మేధావి వర్గానికి చెందిన రచయితలపై కేంద్ర ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్దన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తుని గొల్ల అప్పారావు సెంటర్లో లిబరేషన్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ప్రముఖ రచయిత అరుంధతీరాయ్‌పై 14 ఏళ్ల క్రితం నాటి కేసును ఇప్పుడు నమోదు చేయడం దారుణమన్నారు. మేధావి వర్గాన్ని భయభ్రాంతులకు గురి చేయడం మోదీ ఫాసిస్టు పాలనకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై గళం వినిపిస్తే కేసులు పెడతున్నారని ధ్వజమెత్తారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు జి.సింహాచలం, దడాల లోవరాజు, నూకరాజు, చంటి బాబు, పర్సయ్య పాల్గొన్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం వేడిగా ఉండటంతో పాటు ఉక్కపోతకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లులు, మోస్తరు వర్షం కురిసింది. వేసవిని మించిన వడగాలులు వీయడంతో కొద్ది రోజులుగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేదతీరారు. పూర్తిస్థాయిలో వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

నీరు.. కాలు జారుతోంది సారూ..



ఫ్లోరింగ్‌పై ప్రవహిస్తున్న నీరు

అన్నవరం: రత్నగిరిపై గోకులం సమీపంలో ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ కుళాయిల నుంచి వృథాగా పోయే నీరు డ్రైన్ లేక ఫ్లోరింగ్ మీద నుంచి ప్రవహిస్తుండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ నీటిపై కాలు వేసినప్పుడు జారి పడిపోతున్నారు. సత్యదేవుని దర్శనం అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలోని సప్తగోకులం వద్దకు వచ్చి గోవుల చుట్టూ ప్రదక్షణ చేసి శ్రీకృష్ణుడిని దర్శించుకుంటారు. గోకులం సమీపంలో రాజు వేగిశ్నవారి వాటర్ ప్లాంట్ ఉంది. ఆ ప్లాంట్ నుంచి వచ్చే వృథా నీటిని బయటకు పంపేందుకు డ్రైన్‌లోకి పైప్ లైన్ ఏర్పాటు చేశారు. అనంతరం ఇక్కడ కూలింగ్ వాటర్ కుళాయిలు ఏర్పాటు చేశారు. వాటి నుంచి భక్తులు వాటర్ పట్టుకునే సమయంలో కిందకు పోయే నీరు పోయేందుకు ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో ఆ నీరు ఫ్లోరింగ్ మీద నుంచి ప్రవహిస్తుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీరు పోయేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.